


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
30-01-2026
పేజీలు: 02

# ప్రధానిగా మోదీ హవా..
## పుంజుకుంటున్న రాహుల్ గ్రాఫ్!

**'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే ఆసక్తికర విషయాలు**

దేశ ప్రజల నాడిని పట్టుకునే ఇండియా టుడే 'మూడ్ ఆఫ్ ది నేషన్' తాజా సర్వేలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాదరణ మరోసారి స్పష్టమైంది. భారత తదుపరి ప్రధానిగా నరేంద్ర మోదీనే అత్యుత్తమ ఎంపిక అని సుమారు 55 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడటం విశేషం. కేవలం ఆరు నెలల క్రితం జరిగిన సర్వేతో పోలిస్తే మోదీ రేటింగ్ 3 శాతం మేర పెరగడం గమనార్హం. వరుసగా మూడోసారి అధికారంలో ఉన్నప్పటికీ, ఆయన పట్ల ప్రజల్లో ఆదరణ తగ్గకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రధాని పనితీరుపై కూడా ఈ సర్వేలో సానుకూల స్పందన వ్యక్తమైంది. దాదాపు 57 శాతం మంది ప్రజలు మోదీ పాలన పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ 'గుడ్' రేటింగ్ ఇచ్చారు. మరోవైపు, ప్రధాని పనితీరు 'యావరేజ్' అని 16 శాతం మంది అభిప్రాయపడగా, 24 శాతం మంది మాత్రం ఆయన పాలన పట్ల అసంతృప్తితో 'పూర్' రేటింగ్ ఇచ్చారు. ప్రభుత్వ విధానాల పట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, మెజారిటీ ప్రజలు ఇప్పటికీ మోదీ నాయకత్వం వైపే మొగ్గు చూపుతున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన ఇమేజ్‌ను గణనీయంగా మెరుగుపరుచుకున్నట్లు సర్వే వెల్లడించింది. దేశానికి కాబోయే ప్రధానిగా రాహుల్ గాంధీ అత్యంత అనువైన వ్యక్తి అని 27 శాతం మంది ప్రజలు మద్దతు ప్రకటించారు. గతంతో పోలిస్తే రాహుల్ ప్రజాదరణ పెరుగుతూ వస్తోంది, ఇది రాబోయే ఎన్నికల నాటికి ప్రతిపక్ష కూటమికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చే అవకాశం ఉంది. ప్రధానమంత్రి పదవికి సంబంధించి మోదీకి ప్రధాన ప్రత్యామ్నాయం రాహుల్ గాంధీనేనని ఈ సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తంగా చూస్తే, దేశ రాజకీయాల్లో ప్రస్తుతం నరేంద్ర మోదీ ఆధిపత్యం



కొనసాగుతున్నప్పటికీ, ప్రతిపక్షాల బలం కూడా క్రమంగా పెరుగుతోంది. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజల ప్రాధాన్యతలు మారుతున్న తరుణంలో, ఈ సర్వే ఫలితాలు ప్రస్తుత రాజకీయ ముఖచిత్రాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలు మోదీకి ప్లస్ అవుతుండగా, యువతలో పెరుగుతున్న రాహుల్ గాంధీ క్రేజ్ భవిష్యత్తులో గట్టి పోటీని ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

# అజిత్ పవార్ వారసురాలిగా సునేత్రా పవార్?



మహారాష్ట్ర రాజకీయ ధృవతార, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అకాల మరణంతో ఏర్పడిన శూన్యాన్ని భర్తీ చేసేందుకు ఎన్సీపీ (అజిత్ వర్గం) కసరత్తు మొదలుపెట్టింది. అజిత్ పవార్ రాజకీయ వారసురాలిగా ఆయన భార్య, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు సునేత్రా పవార్‌ను రంగంలోకి దించాలని పార్టీ సీనియర్ నేతలు నిర్ణయించినట్లు సమాచారం. ఆమెను రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకుని, ఉప ముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని పార్టీ నాయకత్వం యోచిస్తోంది. గురువారం బారామతిలో అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిసిన వెంటనే పార్టీ భవిష్యత్తుపై కీలక భేటీ జరిగింది. ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజబల్, సునీల్ తట్కరే వంటి సీనియర్ నేతలు సునేత్రాతో చర్చలు జరిపారు. "ప్రజలందరూ 'వాహిని' (సునేత్రా పవార్) నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. అజిత్ దాదా ఆశయాలను ఆమె మాత్రమే ముందుకు తీసుకెళ్లగలరు" అని మంత్రి నరహరి జిర్వాల్ స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనపై చర్చించేందుకు ఎన్సీపీ నేతలు త్వరలోనే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలవనున్నారు. అజిత్ పవార్ మరణం తర్వాత మహారాష్ట్రలో మరో ఆసక్తికర పరిణామం కనిపిస్తోంది. విడిపోయిన బాబాయ్ (శరద్ పవార్), అబ్బాయ్ (అజిత్ పవార్) వర్గాలు మళ్ళీ కలిసే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. నిజానికి, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనే రెండు వర్గాలు కలిసి పనిచేశాయి. "కుటుంబం, పార్టీ మళ్ళీ ఒకటి కావాలన్నదే అజిత్ దాదా చివరి కోరిక. ఆ దిశగా అడుగులు పడుతున్నాయి" అని పవార్ కుటుంబ సన్నిహితులు వెల్లడించారు. బుధవారం బారామతి సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నేతగా పేరున్న ఆయన మరణం మహాయుతి (బీజేపీ-శివసేన-ఎన్సీపీ) కూటమికి పెద్ద దెబ్బ.

# అరచేతితో సూర్యకాంతిని ఆపలేరు.. అలాగే కేసీఆర్ చేసిన అభివృద్ధిని దాచలేరు

కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఒక అక్రమ కేసులో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి డైవర్షన్ డ్రామా ఆడుదామని అనుకున్న సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులా అదే రోజు తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అద్భుత ప్రగతిని ఎకనామిక్ సర్వే 2025-26 కళ్లకుకట్టిందని అన్నారు. అర చేతితో సూర్యకాంతిని ఆపలేరని అంటారని.. దీనికి తగ్గట్టే కేసీఆర్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని దాచిపెట్టాలని రేవంత్ బృందం ఎన్ని దుష్టపన్నాగాలు పన్నినప్పటికీ కుదరట్లేదని కేటీఆర్ అన్నారు. ఆర్బీఐ, నీతిఆయోగ్ వంటి మేధో సంస్థలు, 'ది ఎకానమిస్ట్' వంటి అంతర్జాతీయ పత్రికలు, నిపుణులు కేసీఆర్ పాలనను ఇప్పటికే వేనోళ్ల పొగిడారని గుర్తుచేశారు. తాజాగా ఈ జాబితాలో కేంద్రప్రభుత్వం వెలువరించిన ఆర్థిక సర్వే 2025-26 కూడా చేరిందని తెలిపారు. కాళేశ్వరానికి, మిషన్ కాకతీయకు కితాబు ఇచ్చాయని అన్నారు. 2014లో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలుగా ఉంటే అది 2023 ఆర్థిక సంవత్సరానికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగినట్టు సర్వే వెల్లడించిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్, మల్టీ పర్పస్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం, చెరువుల పునరుజ్జీవనానికి ఉద్దేశించిన మిషన్ కాకతీయ పథకాలతోనే రాష్ట్రంలో సాగు విప్లవం సాధ్యమైందని ఆర్థిక సర్వే నొక్కి చెప్పిందని పేర్కొన్నారు. అలా తొమ్మిదేండ్ల వ్యవధిలోనే 89 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు



అందించడంలో కేసీఆర్ సర్కారు విజయం సాధించినట్టు ప్రశంసించిందన్నారు

# అప్పట్లో భయం వేసింది: ఈషా రెబ్బా



ఈషా రెబ్బా తెలుగు సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు కోసం నిరంతరం ప్రయత్నిస్తున్న నటీమణుల్లో ఒకరు. 'అంతకు ముందు ఆ తర్వాత' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన ఈషా, 'అరవింద సమేత వీరరాఘవ', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి పెద్ద చిత్రాల్లో కీలక పాత్రల్లో కనిపించింది. అందం, అభినయం ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో పెద్ద అవకాశాలు రాకపోవడం తన కెరీర్‌లో ఒక లోటుగానే ఉందని చెప్పుకోవచ్చు. నేడు 'ఓం శాంతి శాంతి శాంతిః' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈషా రెబ్బా, ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'అరవింద సమేత వీరరాఘవ' సినిమాలో నటించిన అనుభవాలను ఓపెన్‌గా పంచుకుంది.అయితే కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ కాకుండా వేరే పాత్రలు చేస్తే, భవిష్యత్తులో కూడా అలాంటి రోల్స్‌కే పరిమితం చేస్తారేమో అన్న భయం అప్పట్లో తనలో ఉందని అంగీకరించింది. మొదట తనది లీడ్ రోల్ అని చెప్పడంతో హ్యాపీగా ఫీలయ్యానని, కానీ స్టీరియోటైప్ అవుతానేమో అన్న టెన్షన్ కూడా వెంటాడిందని వివరించింది.



# రిబాకినా X సబలెంకా

చివరి అంకానికి చేరిన ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ అరీనా సబలెంకా, కజకిస్థాన్ అమ్మాయి ఎలీనా రిబాకినా ఫైనల్ చేరారు. సెమీస్‌లో ఈ ఇద్దరూ తమ ప్రత్యర్థులను చిత్తుచేసి టైటిల్ పోరుకు సిద్ధమయ్యారు. గురువారం రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీస్‌లో సబలెంకా.. 6-2, 6-3తో స్విటోలినా (ఉక్రెయిన్)ను వరుస సెట్లలో మట్టికరిపించి సునాయస విజయం సాధించింది. గంటా 16 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రపంచ ఒకటో ర్యాంకర్.. పూర్తి నియంత్రణతో కూడిన దూకుడు ముందు స్విటోలినా నిలువలేకపోయింది. సబలెంకాకు ఇది నాలుగో ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్ కాగా హార్డ్‌కోర్టులలో వరుసగా ఏడోది కావడం విశేషం.




# ఫైనల్లో ఆర్సీబీ

మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(RCB) జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్సీబీ ఆపై రెండు ఓటముల నుంచి తేరుకొని యూపీ వారియర్స్‌పై పంజా విసిరింది. 149 పరుగుల ఛేదనలో ఓపెనర్ గ్రేస్ హ్యారిస్(75) అర్ధ శతకంతో విరుచుకుపడగా.. స్మృతి మంధాన(54 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టింది. దాంతో, 8 వికెట్ల తేడాతో గెలుపొందిన బెంగళూరు 12 పాయింట్లతో నాలుగో సీజన్ ఫైనల్లో అడుగుపెట్టింది. డబ్ల్యూపీఎల్ మూడో సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. నాలుగో సీజన్‌లో వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్సీబీ.. లీగ్ దశ చివరి పోరులోనూ చెలరేగింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొడుతూ యూపీ వారియర్స్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. 149 పరగుల మోస్తురు ఛేదనలో గ్రేస్ హ్యారిస్(75), స్మృతి మంధాన(54 నాటౌట్)ల విధ్వంసంతో యూపీ బౌలర్లు నీరుగారిపోయారు.



# రహదారి ఆక్రమణలను తొలగించిన హైడ్రా

రంగరెడ్డి జిల్లా అబ్దుల్‌పూర్‌మెట్ మండలం పెద్దంబర్‌పేట విలేజ్‌లో ఓ లే ఔట్‌లోకి చొరబడి రహదారులను ఆక్రమించేసి నిర్మించిన ప్రహరీని హైడ్రా గురువారం తొలగించింది. 265 సర్వే నంబరులో 278 ప్లాట్లతో శబరిహిల్స్ పేరిట లే ఐట్ వేశారు. ఈ లే ఔట్‌కు ఆనుకుని 346 సర్వే నంబరులో ఎకరం భూమి కొన్న వ్యక్తి లే ఔట్‌లోకి జరిగి 20 ప్లాట్ల మేర ఆక్రమించారు. తన స్థలంలోంచి నాలా వెళ్తోందని చెబుతూ.. ఈ స్థలం తనదంటూ ఆక్రమణకు పాల్పడ్డాడు. ఈ ఆక్రమణతో తమ ప్లాట్లతో పాటు.. లే ఔట్‌లోకి వెళ్లే దారి కూడా బంద్ అయ్యిందని శబరి హిల్స్ లేఔట్ ప్లాట్ల యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు హైడ్రా విచారణ చేపట్టింది. ఇరుపక్షాల సమక్షంలో ఏడీ సర్వేతో హద్దులను నిర్ధారించింది. లే ఔట్‌లోకి 4 వేల గజాల వవరకూ జరిగినట్టు నిర్ధారించుకుని.. అందులోని రహదారులకు ఆటంకంగా ఉన్న ప్రహరీలను హైడ్రా గురువారం తొలగించింది. దీంతో శబరిహిల్స్ లే ఔట్ నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు.



# దసరాకు రానున్న ఫౌజీ

ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ డ్రామా 'ఫౌజీ' చిత్రాన్ని దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. గురువారం ఈ విషయాన్ని మేకర్స్ వెల్లడించారు. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. స్వాతంత్రోద్యమ కాలం నాటి ఈ కథలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. యుద్ధం, త్యాగం, దేశభక్తి, ప్రేమ ప్రధానాంశాలుగా హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నదని, సినిమా పూర్తయ్యేంత వరకు నాన్‌స్టాప్‌గా ఈ షెడ్యూల్ కొనసాగుతుందని దర్శకుడు పేర్కొన్నారు. ఇమాన్వీ, అనుపమ్‌ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సుదీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: హను.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# పీటీ ఉష భర్త కన్నుమూత

భారతదేశం గర్వించదగ్గ క్రీడాకారిణి, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త వెంగలిల్ శ్రీనివాసన్ కన్నుమూశారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. నిన్న అర్ధరాత్రి ఆయన కోజికోడ్ జిల్లాలోని తిక్కోడి పెరుమల్పురంలో ఉన్న నివాసంలో అర్ధరాత్రి 1 గంట సమయంలో ఒక్కసారిగా కుప్పకూలారు. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆయన అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ప్రకటించారు.  భర్త మరణించిన సమయంలో పీటీ ఉష ఇంట్లో లేరు. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఆమె ఢిల్లీలో ఉన్నారు. తన భర్త మరణవార్త తెలియగానే ఆమె వెంటనే ఢిల్లీ నుంచి బయల్దేరి కేరళకు చేరుకున్నారు.

# ‘కల్కి 2’లో సాయిపల్లవి?



‘కల్కి 2898ఏడీ’లో దీపికా పడుకొనే పోషించిన ‘సుమతి’ పాత్ర చాలా కీలకం. ఓ విధంగా కథంతా ఆ పాత్ర చుట్టూనే తిరుగుతుంది. రెండో భాగంలో ఆ పాత్ర ప్రాధాన్యత మరింత ఎక్కువగా ఉంటుందట. అయితే.. దీపికాను ఆ సినిమా నుంచి తప్పించిన విషయం తెలిసిందే. మరి ఇప్పుడు ‘కల్కి 2’లో సుమతిగా ఎవరు కనిపిస్తారు ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అలియాభట్ ఆ పాత్రకు ఎంపికైనట్టు గతంలో వార్తలు వచ్చాయి. అయితే.. అందుతున్న తాజా సమాచారం ప్రకారం ఆ పాత్రకు సాయిపల్లవిని తీసుకున్నట్టు తెలిసింది. ఇటీవలే సాయిపల్లవికి దర్శకుడు నాగ్అశ్విన్ పాత్రను వివరించారని, ఆమె కూడా సుమతిగా కనిపించేందుకు ఉవ్విళ్లూరుతున్నదని ఇన్‌సైడ్ టాక్. కల్కికి జన్మనిచ్చే క్రమంలో సుమతి అనుభవించే కష్టాలు, వాటి చుట్టూ నిండిన పురాణ నేపథ్యమే ఈ సినిమా కథ. మరి ఈ వార్తలో నిజం ఎంతుందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.



# ముఖ్యమంత్రి చంద్రబాబు నన్ను టార్గెట్ చేశారు: చెవిరెడ్డి

మద్యం అక్రమాల కేసులో అరెస్టయిన వైసీపీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఎట్టకేలకు జైలు నుంచి బయటకు వచ్చారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో గురువారం రాత్రి ఆయన విజయవాడ జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. ఆయనతో పాటు ఇదే కేసులో నిందితులుగా ఉన్న వెంకటేశ్ నాయుడు (226 రోజుల తర్వాత), సజ్జల శ్రీధర్‌రెడ్డి (280 రోజుల తర్వాత) కూడా విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు రాగానే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనను రాజకీయంగా టార్గెట్ చేశారని ఆరోపించారు. "ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం నుంచి రాజకీయంగా ఎదిగి, ఎమ్మెల్యేగా గెలిచినందుకే నాపై కక్ష కట్టారు. గతంలో 72 కేసులు పెట్టి వేధించడమే కాకుండా, జైలులో కూడా కనీస గౌరవం లేకుండా ప్రవర్తించారు" అని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న తనను పోలీసులు బస్సులో కింద కూర్చోబెట్టి ఊర్లు తిప్పారని నాటి చేదు అనుభవాలను గుర్తు చేసుకున్నారు. నేతల విడుదల సందర్భంగా విజయవాడ జైలు పరిసర ప్రాంతాలు వైసీపీ కార్యకర్తలతో సందడిగా మారాయి. మాజీ మంత్రి జోగి రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు వీరికి స్వాగతం పలికారు. భారీగా బాణసంచా కాల్చడమే కాకుండా 'జై జగన్' నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. వెన్నునొప్పి సమస్యతో బాధపడుతున్న చెవిరెడ్డి.. ఏసీబీ కోర్టు అనుమతితో గురువారం ఉదయం మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమానికి చికిత్స కోసం వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగానే హైకోర్టు నుంచి బెయిల్ ఉత్తర్వులు రావడంతో మధ్యాహ్నం తిరిగి జైలుకు చేరుకుని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని రాత్రికి విడుదలయ్యారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం అక్రమాలపై సిట్ విచారణ ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే చెవిరెడ్డి సహా పలువురు నేతలను అరెస్ట్ చేశారు.

# జెలెన్‌స్కీకి రష్యా ఆహ్వానం.. రంగంలోకి ట్రంప్




దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అంతర్జాతీయ వేదికలపై దౌత్య ప్రయత్నాలు తుది దశకు చేరుకున్నాయి. రష్యా ప్రభుత్వం మరోసారి ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీని శాంతి చర్చల కోసం మాస్కో రావాల్సిందిగా ఆహ్వానించింది. ఈ మేరకు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే, జెలెన్‌స్కీ గతంలోనే ఇలాంటి ఆహ్వానాన్ని తిరస్కరించారు. ప్రతిరోజూ క్షిపణి దాడులు చేస్తున్న దేశ రాజధానికి తాను వెళ్లలేనని, చర్చలు జరగాలంటే పుతిన్ 'కీవ్'కు రావాలని డిమాండ్ చేశారు. తాజా ఆహ్వానంపై ఉక్రెయిన్ ఇంకా అధికారికంగా స్పందించలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధాన్ని ముగించడమే లక్ష్యంగా చేపట్టిన దౌత్యవేత్తల చర్చలు అబుదాబిలో సాగుతున్నాయి. గత వారాంతంలో జరిగిన మొదటి రౌండ్ చర్చలు 'నిర్మాణాత్మకంగా' సాగాయని, ఫిబ్రవరి 1వ తేదీన రెండో రౌండ్ చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. "చాలా మంచి పరిణామాలు జరుగుతున్నాయి" అని ఈ చర్చల పురోగతిపై ట్రంప్ స్వయంగా ట్వీట్ చేయడం విశేషం. ఉక్రెయిన్‌లో ప్రస్తుతం మైనస్ డిగ్రీల చలి తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితుల్లో లక్షలాది మంది ప్రజలు అంధకారంలో మగ్గిపోవడంతో, మానవతా దృక్పథంతో విద్యుత్ గ్రిడ్లపై దాడులు ఆపాలని ట్రంప్ చేసిన విజ్ఞప్తికి రష్యా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. దీనిపై రష్యా నేరుగా స్పందించనప్పటికీ, వారం రోజుల పాటు 'హ్యూమానిటేరియన్ పాజ్' (మానవతా విరామం) ఇచ్చే అవకాశం ఉందని వైట్ హౌస్ వర్గాలు వెల్లడించాయి. శాంతి ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నా, కొన్ని అంశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. అలాగే, రష్యా ఆక్రమించిన సుమారు 20 శాతం ఉక్రెయిన్ భూభాగాల (ముఖ్యంగా డోనెట్స్క్ రీజియన్) భవిష్యత్తుపై ఏకాభిప్రాయం కుదరడం లేదు. యుద్ధం తర్వాత ఉక్రెయిన్‌కు అమెరికా ఇచ్చే భద్రతా హామీల పట్ల రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జపోరిజియా అణు ప్లాంట్ నియంత్రణ ఎవరి దగ్గర ఉండాలనేది ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది.

## ఇద్దరు యువకుల వేధింపులు తట్టుకోలేక

# మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

హనుమకొండ జిల్లాలో దారుణం జరిగింది. ఇద్దరు యువకుల వేధింపులతో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. మీరు ఇద్దరు కలిసి నా జీవితాన్ని నాశనం చేశారు.. మీవల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ చేసి మరీ ఆమె గడ్డిమందు తాగింది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యాతండాకు చెందిన అనిత వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తుంది. ఆమెను పెళ్లి చేసుకుంటానని దూరపు బంధువైన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం కొమ్మనపల్లి తండాకు చెందిన రాజేందర్ నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. కానీ డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయాలని.. వేరే ఎవరితోనూ చనువుతో మాట్లాడవద్దని కొంతకాలంగా వేధింపులకు పాల్పడ్డాడు. రాజేందర్ వైఖరి నచ్చకపోవడంతో ఈ విషయాన్ని అనిత తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో అనితను ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని రాజేందర్‌కు తెగేసి చెప్పాడు. అయినా అనితను ఇచ్చిపెళ్లి చేయాలని బతిమిలాడుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో అనితకు తన క్లాస్‌మేట్ జబ్బార్‌లాల్‌తో చనువు ఏర్పడింది. అతడిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నట్లు రాజేందర్‌కు తెలిసింది. కోపంతో జబ్బార్‌కు రాజేందర్ ఫోన్ చేసి అనిత గురించి తప్పుగా చెప్పాడు. అప్పటి నుంచి జబ్బార్ కూడా అనితను వేధించడం మొదలుపెట్టాడు. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇద్దరి వేధింపులతో మానసికంగా కుంగిపోయిన అనిత ఈ నెల 27న రాజేందర్‌కు ఫోన్ చేసి కన్నీళ్లు పెట్టుకుంది. నువ్వు, జబ్బార్ కలిసి నా జీవితాన్ని నాశనం చేశారు.. మీ వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. కానీ రాజేందర్ ఆ మాటలను ఏ మాత్రం పట్టించుకోలేదు. చస్తే చావు అంటూ రాజేందర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో వెంటనే గడ్డిమందు తాగి అనిత ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు అనితను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అనిత మరణించింది. అనిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# తెలుగులో ధురంధర్




పెద్దగా అంచనాలు లేకుండా విడుదలై బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్'.. ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను పలకరించింది. థియేటర్లలో భారీ విజయం తర్వాత ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. ఇవాళ్టి నుంచి హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి అగ్ర నటులు కీలక పాత్రలు పోషించారు. ఆదిత్య ధర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా నిర్మాణ బాధ్యతలు కూడా చేపట్టారు. ఎలాంటి భారీ ప్రచారం లేకుండానే బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించిన 'ధురంధర్', ప్రపంచవ్యాప్తంగా రూ.1350 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. విడుదలై రెండు నెలలు దాటినా కొన్ని థియేటర్లలో ఇంకా ప్రదర్శితమవుతుండటం ఈ సినిమాకు ఉన్న ఆదరణకు నిదర్శనం. ఈ చిత్రంతో సారా అర్జున్ బాలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమయ్యారు.

# ‘భగవంత్ కేసరి’కి ప్రీక్వెల్ ప్లాన్ చేస్తున్న అనిల్ రావిపూడి



వరుస విజయాలతో టాలీవుడ్‌లో తిరుగులేని సక్సెస్ రేట్‌ను కొనసాగిస్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి, తన తదుపరి ప్రాజెక్టులపై తాజాగా క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఇటీవల మెగాస్టార్ చిరంజీవితో ఆయన తెరకెక్కించిన ‘మన శంకర వరప్రసాద్ గారు’ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 360 కోట్లకు పైగా వసూళ్లను సాధించి సరికొత్త రికార్డులను సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ భారీ విజయం అందించిన జోష్‌తో ఉన్న అనిల్, నందమూరి బాలకృష్ణతో తాను గతంలో చేసిన ‘భగవంత్ కేసరి’ చిత్రానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. బాలయ్య అభిమానుల నుండి వస్తున్న విపరీతమైన అభ్యర్థనల మేరకు ‘భగవంత్ కేసరి’ చిత్రానికి ప్రీక్వెల్ లేదా సీక్వెల్ రూపొందించే ఆలోచనలోతాను ఉన్నట్లు అనిల్ స్పష్టం చేశారు. ముఖ్యంగా భగవంత్ కేసరి అనే పవర్‌ఫుల్ పాత్ర పోలీస్ ఆఫీసర్‌గా మారకముందు అతని గత జీవితం ఎలా ఉండేది, ఆ క్యారెక్టర్ వెనుక ఉన్న అసలు సంఘర్షణ ఏమిటి అనే అంశాలతో కూడిన ప్రీక్వెల్ కథ సిద్ధం చేస్తే అది మరో స్థాయిలో ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తన కెరీర్‌లోనే ఈ చిత్రం ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్న అనిల్ రావిపూడి, బాలయ్య బాబును సరికొత్త మాస్ కోణంలో చూపించేందుకు కథా చర్చలు జరుపుతున్నట్లు తెలపడంతో నందమూరి అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# కుర్రకారుకు పిచ్చెక్కిస్తున్న కేట్ శర్మ

బికినీలో తన నాజూకు అందాలను హైలైట్ చేస్తూ కుర్రకారు మతిపోగొడుతోంది ఈ ముద్దుగుమ్మ. కేట్ శర్మ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ పిక్స్ చూసిన వారంతా హాట్, ఉఫ్, స్టన్నింగ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొద్ది గంటల్లోనే ఫొటోలకు లక్షల్లో లైకులు వచ్చాయి.సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ కనిపించే కేట్ శర్మ.. తరచు నెట్టింట బోల్డ్ ఫొటో షూట్లతో ఆకట్టుకుంటూ ఉంటుంది.కేట్ శర్మ జూలై 19, 1997న భారతదేశంలోని మహారాష్ట్రలోని ముంబైలో జన్మించింది. రూహ్‌దార్ , పరమావతార్ శ్రీ కృష్ణ, తు మేరీ జిందగీ వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకుంది.సినిమాల్లో పెద్దగా కనిపించక పోయినా.. సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫోజులతో కుర్రకారును ఫిదా.

